సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం

- ప్రయాణికులకు సమస్యలు తలెత్తకుండా మెరుగైన సేవలు
- కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం హరి



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించి గమ్యస్థానాలకు చేర్చడమే టీఎస్ ఆర్టీసీ ప్రధాన లక్ష్యం. మంగళవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం డి.హరి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

- ఫతేనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి)

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో బస్సుల సంఖ్య ఎంత?

కూకట్‌పల్లి ఆర్టీసీ దశాబ్దాల కాలం నుంచి ప్రజలకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం డిపోలో 136బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి.

డ్రైవర్లు, కండక్టర్లు ఎంత మంది?

డిపోలో ప్రస్తుతం 330 మంది కండక్టర్లు, 330 మంది డ్రైవర్లు పని చేస్తున్నారు.

బస్సులు ఏఏ రూట్లలో తిరుగుతున్నాయి?

కూకట్‌పల్లి డిపోకు చెందిన బస్సులు దాదాపు అన్ని రూట్లలో నడుస్తున్నాయి. మోహిదీపట్నం, శంకర్‌పల్లి, బచ్చన్నపేట, సికింద్రాబాద్, బోరబండ, ప్రగతీనగర్, హౌజింగ్‌బోర్డులోని అన్ని ఫేజ్‌లను కలుపుతు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి.

ఏఏ సందర్భాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతారు?

సంక్రాంతి, దసరా, దీపావళి, రాఖీపౌర్ణమి తదితర పండుగలకు ఆంధ్రా, తెలంగాణకు ప్రత్యేక బస్సులు నడుపుతుంటాం. ఇవి ఎక్కువగా కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు బస్టాపు, జగద్గిరిగుట్ట నుంచి వెళ్తాయి.

ప్రగతి చక్ర అవార్డులు ఎంత మందికి వచ్చాయి?

కూకట్‌పల్లి డిపోలో 28 మందికి ప్రగతిచక్ర అవార్డులు వచ్చాయి. డ్రైవర్లు 10 మంది, కండక్టర్లు 10 మంది, జబ్బర్‌దస్త్ జోడీ 4, మెకానిక్‌లు నలుగురు వారికి పారితోషకం అవార్డులు కూడా ఇచ్చాం.

ఎన్ని ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి?

డిపోకు ఇంకా ఎలక్ట్రిక్ బస్సులు రాలేదు. 4వ ఫేజ్‌లో బస్సులు మంజూరయ్యే అవకాశం ఉంది.

ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి మీరిచ్చే సలహాలు సూచనలు ఏంటి?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసేందుకు ఆర్టీసీ సిబ్బంది మొత్తం కృషి చేస్తోంది. ఆర్టీసీ అనేది మన అందరి సంస్థ అని ప్రయాణికులు గుర్తించాలి. ఆర్టీసీ సిబ్బంది పట్ల గౌరవమర్యాదలతో వ్యవహరించాలి. ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేయరాదు. టికెట్లు లేకుండా ప్రయాణం చేస్తే శిక్ష తప్పదని గుర్తించాలి. ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు సైతం ప్రయాణికుల పట్ల గౌరవ మర్యాదలతో వారిని గమ్యస్థానాలకు చేర్చాలి. ప్రయాణికులకు ఆర్టీసీ పరంగా ఏమైన ఇబ్బంది కల్గినా, సమస్యలు ఉన్నా 9959226151 నంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు.

'ఉస్మానియా' వద్ద బాలుడి కిడ్నాప్

- 12 గంటల్లో కిడ్నాపర్‌ను పట్టుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ బాలస్వామి, ఏసీపీ శంకర్, సీఐ లింగేశ్వర్‌రావు

అఫ్జల్‌గంజ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు 12 గంటల్లో ఛేదించారు. క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ బి.బాలస్వామి, ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కిడ్నాప్ వివరాలను వెల్లడించారు. మల్లేపల్లి మంగర్‌బస్తీకి చెందిన మహ్మద్ సద్దాం, రుబీనాబేగం భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. సద్దాం అనారోగ్యంగా ఉండడంతో వైద్యం కోసం సోమవారం కుమారుడు షోయబ్(4)ని తీసుకొని ఉస్మానియా ఆస్పత్రికి వచ్చాడు. ఆస్పత్రిలో చూపించుకున్న తర్వాత ఓపీ భవనం వద్ద పడుకున్నాడు. వీరిని వరంగల్ ప్రాంతానికి చెందిన షేక్ రఫిక్(38) గమనించాడు. షోయబ్‌ని తీసుకుని కాలినడకన ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, చాదర్‌ఘాట్ నుంచి డబీర్‌పురాకు వెళ్లాడు. రాత్రి అయినా ఉస్మానియా ఆస్పత్రికని వెళ్లిన భర్త తిరిగిరాకపోవడంతో ఆందోళన చెందిన రుబీనాబేగం ఆస్పత్రికి వచ్చింది. సద్దాం ఫుట్‌పాత్‌పై పడుకుని ఉండగా, షోయబ్ కనిపించ లేదు. వెంటనే అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని నాలుగు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి బాలుడి కోసం వెతికారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. షేక్ రఫిక్ బాలుడిని తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలుడిని ఓ మహిళ వద్ద ఉంచినట్లు తెలిపా డు. డీఎస్ఐ రామకృష్ణ, టీమ్ బాలుడిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రుల కు అప్పగించారు. రఫిక్ నాలుగేళ్ల క్రితం వరంగల్ నుంచి నగరానికి వచ్చి ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్నాడని, మద్యానికి బానిసై డబ్బుల కోసం బాలుడిని కిడ్నాప్ చేశాడని డీసీపీ వెల్లడించారు. పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగాన్న బస్టాపులో ఓ వ్యక్తి గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే క్రైంటీం అక్కడి వెళ్లి పరిశీలించగా ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంకు చెందిన గూడెపు రాజు గంజాయి బ్యాగుతో పట్టుబడ్డాడు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. అతని వద్ద ఉన్న 2.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇంతకుముందు కూడా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి ఎనిమిది నెలల పాటు ఉన్నాడు. మూడు నెలలక్రితం బయటకొచ్చిన రాజు మళ్లీ గంజాయి వ్యాపారం కొనసాగిస్తూ పోలీసులకు చిక్కాడు. మంగళవారం న్యాయస్థానం ఎదుట హాజరుపర్చనున్నట్టు పోలీసులు తెలిపారు.

గోల్డ్ స్కీమ్‌లో చేరాలని ఫోన్లు వస్తున్నాయా?



- అన్ని అంశాలు తెలుసుకొని చేరండి
- పండుగ ఆఫర్లు స్కీమ్స్ కట్టే వారికి వర్తించవు
- మధ్యలో ఆపేస్తే లాభం కంటే నష్టమే ఎక్కువ
- కూకట్‌పల్లి పరిసర ప్రాంతవాసులకు ఫోన్లు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):

హలో అమూల్య గారు.. నా పేరు శ్రీరమ్య... మేము గోల్డ్ షోరూం నుంచి కాల్ చేస్తున్నాం. ధన్‌తేరాస్ రోజున గోల్డ్ కొనడానికి వచ్చినప్పడు మీరు నంబర్ ఇచ్చారు గుర్తుంది కదా.. ఆ.. అంటూ అవతలి నుంచి సమాధానం రావడంతో గోల్డ్ స్కీం గురించి ఒకసారి మా షోరూంకు వస్తారా అంటూ కాస్త నెమ్మదిగా మాట్లాడింది.

హలో సార్ నాపేరు శ్రీలేఖ నేను గోల్డ్ షాపు నుంచి ఫోన్ చేస్తున్నా.. మాట్లాడుతుంది నాగార్జున గారే కదా.. ఆ... చెప్పండి మేడం అనడంతో.. ధన్‌తేరాస్ రోజున మేడంకు బంగారు నగలు కొనడానికి మా షాప్‌కొచ్చి ఏమీ కొనకుండానే వెళ్లిపోయారు. మీకు తక్కువ ధరలో గోల్డ్ కొనుగోలు చేసేందుకు మా వద్ద స్కీమ్స్ ఉన్నాయి. మీరు వస్తారా? మమ్మల్ని రమ్మంటారా.. అంటూ ఫోన్ చేసింది.

పైన పేర్కొన్న రెండు ఉదాహరణల్లో సారాంశం ఒక్కటే గోల్డ్ స్కీమ్స్‌లో చేర్పించేందుకు కూకట్‌పల్లిలోని పలు నగల దుకాణాలకు చెందిన ఉద్యోగులు వరుసగా కస్టమర్లకు కాల్స్ చేస్తున్నారు. ఎలాగైనా పసిడి అమ్మడమే లక్ష్యంగా పెట్టుకొని ఉద్యోగులకు ఆయా దుకాణాల నిర్వాహకులు, మేనేజర్లు టార్గెట్లు నిర్దేశించారట. దీంతో రోజుకు కనీసం ఒక్కో ఉద్యోగి 15 నుంచి 20 మందికి ఫోన్‌చేసి గోల్డ్ స్కీమ్స్ గురించి మాట్లాడుతున్నామని ఓ దుకాణంలో పనిచేసే ఉద్యోగి తెలిపారు.

మర్యాదలకు మురిసిపోవద్దు..

పసిడి ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో కొనడానికి కాస్త వెనకడుగు వేస్తున్నారు కొనుగోలు దారులు. కానీ మహిళలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని బంగారు నగలు అమ్మేందుకు ఉద్యోగుల చేత ఫోన్లు చేయించి దుకాణాలకు రప్పిస్తున్నారు. ఇటీవల ధన్‌తేరాస్ రోజున అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగడంతో గోల్డ్ స్కీమ్స్‌పై దృష్టిసారించారు. రెండు రోజులుగా కార్తీక మాసం, మహిళల సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునే పనిలో దుకాణాల నిర్వాహకులు నిమగ్నమయ్యారు.



ఈనెల అంతా శుభం అంటూ ఆయా దుకాణాలకు వచ్చే వారికి మినరల్ మంచినీళ్ల బాటిల్స్, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్ ఇస్తూ మచ్చిక చేసుకొని గోల్డ్ తమ షోరూంలోనే కొనుగోలు చేసేలా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గోల్డ్ స్కీమ్స్‌కు చట్టబద్ధత ఏమీ లేదు. నగలు కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ అనే పదాన్ని ప్రస్తుతం గోల్డ్ స్కీమ్స్‌గా చెలామణి చేస్తున్నారు. పెద్దపెద్ద దుకాణాలైతే ఓకే... చిన్నపాటి, ఊరు, పేరు తెలియని వారి దగ్గర స్కీమ్స్ కడితే వారి దుకాణం ఎత్తేస్తే పరిస్థితి ఏంటి? ఇవన్నీ పరిగణలోకి తీసుకోకుండా ఆయా షోరూమ్స్‌లో రాచమర్యాదలను చూసి స్కీమ్స్‌లో చేరవద్దని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

కట్టే ముందే ఇవి చూసుకోండి..

గోల్డ్ స్కీమ్స్ అన్నీ దాదాపు 10, 11 నెలల పాటు నెలకు రూ. 5 వేలు కడితే మరోనెల చెల్లించాల్సిన డబ్బును జమ చేసి రూ. 50,000 లేదా రూ. 55,000 వేలకు బంగారు నగలు కొనుగోలు చేయొచ్చు. ఇక్కడ కూడా 10, 11 నెలల పాటు ఉంటున్నా ఆ నెలలో ఏ రోజు చెల్లిస్తే ఆరోజు రూ. 5 వేలకు ఎంత బంగారం వస్తే అంత జమచేస్తారు. దీనివల్ల బంగారం పెరిగినా, తగ్గినా కస్టమర్‌కు భారం ఉండదు.

ఒక్కో షోరూంలో ఒక్కోలా మీరు నెలనెలా కట్టే డబ్బులకు ఎలాంటి బోనస్ లేకుండా బంగారు ఆభరణాలు కొనేటప్పుడు తరుగు, మజూరీ ఉండదు. ఇప్పుడు చాలా దుకాణాల్లో 2 నుంచి 13 శాతం మధ్యలోనే తరుగు చార్జ్ చేస్తున్నారు. కొన్ని డిజైన్లు ఉండే షోరూమ్స్‌లో మాత్రం 33శాతం వరకు తరుగు ఉంటుంది. మీరు ఏం కొనాలో నిర్ణయించుకున్న తర్వాత మీకు నచ్చిన నగలు దొరికే చోట కడితేనే ప్రయోజనం.

పెద్దపెద్ద బంగారు షోరూమ్స్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీ గల్లీల్లో ఉండే దుకాణాల్లో కూడా గోల్డ్ స్కీమ్స్ రన్ చేస్తున్నారు. పండుగలు, అక్షయ తృతీయ, ధన్‌తేరాస్, ఆయా షోరూమ్స్ వార్షికోత్సవ వేడుకల సమయంలో ఇచ్చే ఆఫర్లు స్కీమ్స్ ద్వారా వచ్చే వారికి వర్తించవు. మీరు ఎక్కడైతే స్కీమ్ కడతారో అక్కడే నగలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

గోల్డ్ స్కీం కట్టేముందు అన్నీ నెలల పాటు కట్టి వెంటనే నెలరోజుల్లోనే నగలను కొనుగోలు చేయాలి. లేదంటే ఎటువంటి బోనస్ లేకుండా మీ అసలు సొమ్మునే మీ బ్యాంక్ అకౌంట్‌కు జమచేస్తారు. కొన్ని దుకాణాల నిర్వాహకులు మాత్రం మేము డబ్బులు ఇవ్వం మీరు నగలే కొనుగోలు చేయాలని కండీషన్ పెడుతున్నారు.

అనివార్య కారణాలవల్ల మధ్యలో స్కీమ్‌కు డబ్బులు కట్టడం ఆపేస్తే ఎటువంటి ప్రయోజనాలు లేకుండా అదే దుకాణంలో నగలు కొనుగోలు చేయాలి. కొన్నింటిలో మాత్రం కనీసం 7 నెలల పాటు కడితే తరుగులో కొంత రాయితీ ఉంటుంది. మీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా స్కీమ్ మధ్యలో ఆపేస్తే డబ్బులు మాత్రం ఇవ్వరు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసువాలి.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ కేపీహెచ్‌బీ సెక్షన్ పరిధిలో ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ బొనిగాల విజయ ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్ 33/11కేవీ సబ్ స్టేషన్ నుంచి వచ్చే మూసాపేట్ 11కేవీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

ఓల్డుబోయినపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, డివిజన్ కార్యదర్శి మేకల హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు కార్పొరేటర్ నివాసంలో ఈ సమావేశం ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు హాజరు కావాలని వారు కోరారు.

'సమస్య పరిష్కారానికి కృషి'

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. మంగళవారం శిల్పా ఎవెన్యూలో అసోసియేషన్ సభ్యులు, ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ సాయిప్రసాద్, జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధి ప్రభాకర్, సివరేజ్ వెంకటేష్, లైట్స్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ ఐడీపీఎల్‌లో పుట్టలో పాలుపోస్తున్న మహిళలు



ఓల్డు బోయినపల్లిలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి సందర్భంగా మంగళవారం ఆయా పరిధిలోని ఆలయాల్లో భక్తులు పూజలు ఘనంగా చేశారు. బాలానగర్‌లోని ఫిరోజ్‌గూడా, సాయినాగేంద్ర ఆలయం, ఐడీపీఎల్ కాలనీ, ఓల్డుబోయినపల్లి మల్లికార్జుననగర్, హస్మత్‌పేట, అంజయ్యనగర్, ఫతేనగర్‌లోని ఎల్‌బీశాస్త్రీనగర్, శివశంకర్‌నగర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో పుట్టల వద్ద పాలు పూజలు చేశారు.

- బాలానగర్/ఓల్డుబోయినపల్లి/ఫతేనగర్/ కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి)



బాలాజీనగర్ శ్రీసంజీవని హనుమాన్ ఆలయంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

లయన్స్ సంస్థ సేవలు అభినందనీయం



బాలానగర్ లయన్స్ కంటి ఆస్పత్రి భూమిపూజ అనంతరం శిలాఫలకం వద్ద మంత్రి దామోదర రాజనర్సింహతో లయన్స్ సభ్యులు

బాలానగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశంలో సామాన్యుడికి కావాల్సింది తమ పిల్లలకు విద్య, కుటుంబానికి మెరుగైన వైద్యమేనని తెలంగాణ రాష్ట్ర వైద్యశాక మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం బాలానగర్‌లోని వై. కృష్ణారావు బాలానగర్ లయన్స్ కంటి ఆస్పత్రి ఎక్స్‌టెన్షన్ బ్లాకు నిర్మాణానికి భూమి పూజకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంతి మాట్లాడుతూ.. 39 సంవత్సరాలుగా లయన్స్ కంటి ఆస్పత్రి సేవలందిచడం అభినందనీమన్నారు. సేవా సంస్థలు గ్రామాలకు వెళ్లి వైద్యం అంశాలపై అవగాహన కల్పిస్తే సామాన్యుడికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన సూచించారు. లయన్స్ వారికి ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించవచ్చన్నారు. మంత్రికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, లయన్ ఆస్పత్రి చైర్మన్ నవీన్‌కుమార్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కోశాధికారి డా. కే. శ్రీనివాస్, కార్యదర్శి త్రిభువన్, సభ్యులు ఆర్.కే.రాజు, నాగభూషన్‌రావు, సాంబశివరాలు, ధనశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాలో మందుల కొరత ఉందని, దీంతో వైద్యం కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించారు. బాలానగర్‌లో లయన్స్ కంటి ఆస్పత్రి ఎక్స్‌టెన్షన్ బ్లాక్ భూమి పూజకు వచ్చిన ఆయన పలు సమస్యలను విన్నవించారు. ప్రసవం కోసం బాలానగర్ ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణిలకు మౌలిక వసతులు లేకపోవడంతో ప్రతి నెల సుమారు 51 వరకు నమోదయ్యే ప్రసవాల సంఖ్య 13కు పడి పోయిందని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం, వైద్య శాఖ స్పందించి ప్రాథమిక కేంద్రం, బస్తీ దవాఖానాలో మందుల కొరత లేకుండా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఆ అధికారుల కేసులు ఏసీబీకి..

- చెరువుల్లో అనుమతులపై గతంలో హైడ్రా ఫిర్యాదు
- కేసులు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ
- కోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు చెరువుల పరిధిలో అక్రమ నిర్మాణాల అనుమతుల విషయంలో రెవెన్యూ అధికారులపై హైడ్రా నమోదు చేసిన కేసులను ఏసీబీకి అప్పగించే యోచనలో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈర్ల చెరువు, ఎర్రకుంట చెరువు పరిధిలో నిర్మాణాలకు అనుమతులు జారీ చేసిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టులో హైడ్రా అధికారులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజాంపేట, మేడ్చల్ మల్కాజిగిరి పరిధిలోని రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఈ కేసులకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసులకు సంబంధించి పలు అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడంతో కేసుల దర్యాప్తు ఏసీబీకి అప్పగించాలని ఈఓడబ్ల్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి సైబరాబాద్ పోలీసులు ఏసీబీ అధికారులకు లేఖ రాసినట్టు తెలుస్తోంది. మదీనగూడలోని ఈర్ల చెరువు, నిజాంపేటలోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు ఇచ్చిన అధికారులపై హైడ్రా ఫిర్యాదు మేరకు పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. హైడ్రా కేసులు నమోదు చేసిన అధికారుల్లో కొంతమంది ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును సైతం ఆశ్రయించారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణ అనుమతుల సందర్భంగా పెద్ద మొత్తంలో అవినీతి జరిగినట్లు గుర్తించిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులు కేసును ఏసీబీకి అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణ



వంశీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్ డీసీగా బి.వంశీకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీసీగా పనిచేసిన అడప రమేష్ అక్టోబరు 30న ఉద్యోగ విరమణ చేయడంతో ఎస్‌డబ్ల్యూఎం ఏఎంసీ ఉదయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా డీసీని నియమిస్తూ సోమవారం రాత్రి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేయడంతో వెంటనే వంశీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది డీసీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసి కట్టుగా పనిచేసి సర్కిల్ పరిధిలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుదామని డీసీ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు.

రెండు పీడీయాక్ట్‌లు.. 47 కేసులు

- అయినా.. ఆగని చోరీలు
- హాస్టళ్లలోకి ప్రవేశించి మొబైల్స్, ల్యాప్‌టాప్‌ల అపహరణ
- ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

పంజాగుట్ట/ హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో మొబైల్, ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి విక్రయిస్తున్న ముఠాలోని ఆరుగురు సభ్యులను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్ తెల్లవారుజామున హోటళ్లు, లాడ్జిలు, హాస్టల్స్‌లోకి వెళ్లి నిద్రలో ఉన్న వారి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నాడు. అతడిపై రెండుసార్లు పీడీయాక్ట్ నమోదుతో పాటు పలు స్టేషన్‌లలో 47 చోరీ కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలుకు వెళ్లిన అహ్మద్‌కు కాంబ్లే వీరు, కాంబ్లే వినయ్ పరిచయమయ్యారు. దీంతో జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ముఠా ఏర్పాటు చేసి తన సోదరుడు మహ్మద్ ఇష్తికార్ అహ్మద్ అలియాస్ అహ్మద్ సహకారంతో బంజారాహిల్స్, ఆసిఫ్‌నగర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, మెహదీపట్నం, మొఘల్‌పురా ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన వస్తువులను కాంబ్లే వీరు, రవి, హసన్, కాంబ్లే వినయ్, అశోక్ కుమార్ అలియాస్ మనోజ్‌ల సాయంతో విక్రయిస్తున్నాడు. ఎండీ హిదాయతుల్లా అలియాస్ తాజ్, మహ్మద్ ఇషాన్‌ల సహకారంతో వాటిని అన్‌లాక్ చేసి అలీబిన్ సలీమ్ అలియాస్ అలీబాబా వద్ద భద్రపరిచేవారు. నిఘా పెట్టిన పంజాగుట్ట పోలీసులు చోరీలకు పాల్పడుతున్న ఇంతియాజ్ అహ్మద్‌తో పాటు అతడికి సహకరిస్తున్న వారిని అరెస్ట్ చేసి రూ. 2లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు.

రాహుల్‌కి స్వాగతం పలికేందుకు వెళ్లిన నేతలు



చిన్నతోకట్ట వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కాంగ్రెస్ నేతలు

బాలానగర్, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన విషయమై హైదరాబాద్ బోయినపల్లిలోని గాంధీ ఐడియాలజి సెంటర్‌కు విచ్చేసిన రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో సభాస్థలికి తరలి వెళ్లారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, తూము వేణు, మధూగౌడ్, నాయకులు కార్యకర్తలు బోయినపల్లి(చిన్నతోకట్ట) వద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి రాహుల్‌గాంధీకి స్వాగతం పలికారు.



కుల గణనకు ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ సమావేశానికి మూసాపేట్ నుంచి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి)

అగ్నిప్రమాదాలపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అనుకోకుండా జరిగే అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వెంకటయ్య సమక్షంలో విద్యార్థులు అడిగిన సందేహాలను ఎస్ఎఫ్‌వో తోట జగన్మోహన్ నివృత్తి చేశారు.

అనుమతి లేకుండా.. ఎలా అరెస్టు చేస్తారు!

- పోలీసుల తీరుపై మండిపడుతున్న రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు
- డీజీపీకి ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌కు వినతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా జ్యుడిషియల్ అధికారాలు కలిగిన సబ్-రిజిస్ట్రార్‌లను ఇటీవల పోలీసులు అరెస్టు చేయడంపై రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్ వ్యక్తుల మధ్య నెలకొన్న భూ వివాదంలో సబ్ రిజిస్ట్రార్లను బాధ్యులుగా పరిగణించడమేంటని ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల చట్టానికి లోబడి విధులు నిర్వహించినప్పటికీ, బయటి వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సబ్ రిజిస్ట్రార్లను అరెస్టు చేయడంపై ఉద్యోగ సంఘాలు సైతం ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయమై టీఎన్‌జీవో నేతలతో కలిసి రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంగళవారం ఐజీ అండ్ కమిషనర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతితో చర్చించారు. సబ్ రిజిస్ట్రార్లను అరెస్టు చేసిన పోలీసుల తీరుపై డీజీపీకి ఫిర్యాదు చేయాలని కోరారు.

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలెలా..

ఉద్యోగుల, అధికారుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గతంలో చేపట్టిన కౌన్సెలింగ్ విధానాన్నే అమలు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని ఉద్యోగ సంఘాలు కోరాయి. ఇటీవల నెల, రెండు నెలల వ్యవధిలో సబ్ రిజిస్ట్రార్లను, జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేయడం పట్ల ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ఏ చిన్న తప్పు జరిగినా, జరుగకున్నా కిందిస్థాయి సిబ్బందిని మాత్రమే బదిలీ చేస్తున్నారని, ఇటీవల చేపట్టిన బదిలీల్లో డీఐజీ స్థాయి అధికారులను ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న పొరపాట్లు చేసి సస్పెండైన అటెండర్లను తిరిగి విధుల్లోకి తీసుకునే అధికారం గతంలో సస్పెండ్ చేసిన అధికారికే ఉండేదని, ఇటీవల వారందరినీ రీ-ఇన్‌స్టేట్‌మెంట్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు.

కొత్త విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని, కిందిస్థాయి ఉద్యోగుల సస్పెన్షన్, రీ-ఇన్‌స్టేట్‌మెంట్ అధికారాలను జిల్లా రిజిస్ట్రార్లకే కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల వినతుల మేరకు రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల వైద్య సేవలు

● డాక్టర్ శైలజా కీర్తి



ఇంటర్వ్యూ

రాయదుర్గం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం వైద్య సేవలను మరింత చేరువచేసేందుకు ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను ప్రజలు వినియోగించుకోవాలని రాయదుర్గం ప్రైమరీ హెల్త్ సెంటర్ (బస్తీ దవాఖాన) వైద్యురాలు డాక్టర్ శైలజా కీర్తి తెలిపారు. మంగళవారం ఆమె ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

దవాఖానాలో ఎన్ని గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు?

ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవుట్ పేషంట్లకు సేవలు అందిస్తాం.

బస్తీ దవాఖానాల్లో ఎలాంటి వైద్య సేవలు అందిస్తారు.?

బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలి. మధుమేహం, బీపీ, వంటి రోగులకు రెగ్యులర్ చెకప్‌లు చేస్తునే వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందిస్తాం. మహిళలు, గర్భిణీలు, వృద్ధులకు నెలవారి మందులను అందిస్తాం.

ఎలాంటి సమస్యలతో ఎక్కువ మంది రోగులు వస్తుంటారు?

సీజనల్ వ్యాధులతో బాధపడే వారు ఎక్కువగా వస్తుంటారు. వారికి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగిన సూచనలు ఇచ్చి వారికి కావాల్సిన మందులను అందజేస్తాం.

ఇన్ పేషంట్ వైద్యం అందించాల్సిన అవసరం ఉన్న వారికి బస్తీ దవాఖానా ఏలా ఉపయోగపడుతుంది?

అత్యవసరంగా ఎలాంటి వైద్య సహాయం అవసరమున్నా ముందుగా బస్తీ దవాఖానాకు వస్తారు. వారికి అత్యవసర చికిత్సను అందిస్తాం. అనంతరం వారి సమస్యను గుర్తించి ఇన్ పేషంట్ వైద్య సేవల కోసం కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రికి, గోల్కొండలోని ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తాం.

రోజుకు సుమారుగా ఎంత మంది రోగులు వస్తున్నారు?

రాయదుర్గం బస్తీ దవాఖానాకు ప్రతి రోజు సుమారు 80 నుంచి 90 మంది పేషంట్లు వస్తున్నారు. బస్తీ దవాఖానాలలో అందించే వైద్య సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలి.

మొండి బకాయిలు.. రూ.7.80 కోట్లు

● చందానగర్ సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ

● చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధం



చందానగర్ సర్కిల్ కార్యాలయం

చందానగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలో పెండింగ్ ఉన్న ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నోటీసులు జారీ చేసినప్పటికీ పలువురు బకాయిలు చెల్లించకపోవడంతో కోట్ల రూపాయల బకాయిలు అలాగే ఉన్నాయి. బకాయిల వసూళ్లకోసం జీహెచ్ఎంసీ రెవెన్యూ సిబ్బంది పలుమార్లు వెళ్లిన బకాయిదారులు స్పందించడంలేదు. సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ డివిజన్లలో కాలనీవాసులు ఆస్తి పన్ను చెల్లించడంలేదు. రూ.50లక్షలకుపైగా ఏడుగురు, రూ.22 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 27 మంది బకాయిదారులు, రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రెండు వందల మంది ఉన్నారు. మొత్తం 234 మంది పన్ను చెల్లింపుదారుల నుంచి సుమారు రూ. 7 కోట్ల 80 లక్షల రూపాయలు జీహెచ్ఎంసీకి బకాయిలు కట్టాల్సిఉంది. ఆస్తి పన్నును సకాలంలో చెల్లించండి.. జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకారం అందించండి అని అధికారులు అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు చేపడుతున్నప్పటికీ బకాయిదారులు మాత్రం నిమ్మకునీరెత్తిట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రతీఏటా మొండి బకాయిలు పెరిగిపోతున్నాయి. బకాయిలు చెల్లింపు దారుల్లో కొన్ని ప్రభుత్వ సంస్థలు కూడా ఉన్నాయి.

234 మందికి నోటీసులు

సర్కిల్ పరిధిలో 234 మంది పన్ను చెల్లింపుదారులు మొండికేయడంతో జీహెచ్ఎంసీ అధికారులు వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమైయ్యారు. పన్ను వసూళ్లపై ఉన్నతాధికారుల నుంచి వత్తిడి పెరగడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

బకాయిలు వసూలు చేస్తాం



సర్కిల్ పరిధిలో మొండి బకాయిలు ఉన్నది వస్తవమే. పలుమార్లు వారికి నోటీసుల కూడా ఇచ్చాం. అందులో కొందరు చెల్లింపు చేశారు. చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేసి, మొండి బకాయిలన్నిటీని వసూలు చేస్తాం.

-మోహన్‌రెడ్డి, ఉప కమిషనర్

భక్తి శ్రద్ధలతో నాగులచవితి

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు



దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఖైల్‌కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో వచ్చే నాగుల చవితి సందర్భంగా మంగళవారం బెల్ టౌన్‌షిప్, ఎంఐజీకాలనీ, శివారు ప్రాంతాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యేగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణలో ఉన్న పుట్టవద్ద మహిళలు పూజలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారికి నిత్యపూజలతో పాటు అభిషేకాలు జరిగాయి. వేముకుంటలోని మహాశక్తి లలితాపోచమ్మ తల్లి దేవాలయంలో నాగుల చవితి సందర్భంగా నిత్యపూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. దేవాలయ ట్రస్టీ, మాజీ కౌన్సిలర్ గుబ్బపు రవీందర్‌రావు ఆధ్వర్యంలో హోమం నిర్వహించి దేవాలయ ప్రాంగణంలోని పుట్టవద్ద పూజలు నిర్వహించారు.

నానక్‌రామ్‌గూడలో

రాయదుర్గం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని పురస్కరించుకొని నానక్‌రామ్‌గూడలోని అభయాంజనేయస్వామి ఆలయంలోని నాగదేవత విగ్రహం వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యాదవ రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాటు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

డివిజన్‌లో భద్రతను పెంచాలి



ఇన్‌స్పెక్టర్ నరసింహకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ కార్పొరేటర్ రంగారావు

హైదర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహను మంగళవారం మాజీ కార్పొరేటర్ రంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలో రాత్రి సమయంలో కొంతమంది యువకులు తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బస్తీల్లో పెట్రోలింగ్ పెంచాలని కోరారు.

కులగణనపై మేధావుల హర్షం

గచ్చిబౌలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కులగణన కోసం ఇంటింటి సర్వేను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని శేరిలింగంపల్లికి చెందిన పలువురు సామాజిక వేత్తలు, మేధావులు అభిప్రాయపడ్డారు. సంక్షేమ ఫలాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని, అందరికీ సంక్షేమం అందాలంటే కులగణన అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కులగణన చేయాలని పలు ఉద్యమాలు, నిరసనలు చేసినా పాలకులు పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కులగణన ఇంటింటి సర్వే చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమానికి అందరు సహకరించాలని సూచించారు. బీసీలకు, అట్టడుగు వర్గాలకు తగిన న్యాయం జరుగుతుందని ఇప్పటి వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా కొంతమందికి మాత్రమే స్వతంత్ర్య ఫలాలు అందుతున్నాయని, అట్టడుగు వర్గాలకు, బీసీలకు అందడం లేదన్నారు.

హాస్టళ్లు, లాడ్జీలను నిషేధించాలని నిరసన

గచ్చిబౌలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ సీ-బ్లాక్‌లో హాస్టళ్లు, లాడ్జీలను నిషేధించాలని కోరుతూ కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో విచలవిడిగా హాస్టళ్లు ఏర్పాటు చేశారని, వీటి వల్ల కాలనీలో సమస్యలు వస్తున్నాయని, డ్రైనేజీ, తాగునీరు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. కాలనీలోని గతంలో ఏ-బ్లాక్ అసోసియేషన్ వాసులు కూడా నిరసన వ్యక్తం చేశారని, ఇక్కడ కొత్తగా హాస్టళ్లు ఏర్పాటు చేయవద్దని జీహెచ్ఎంసీ అధికారులను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఇంజనీర్ రజిత

మిత్రాహిల్స్‌లో పార్కు పరిశీలన

హైదర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ మిత్రహిల్స్ పార్కు విషయంలో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఇటీవల హెచ్ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన అధికారులు హెచ్ఎండీఏ ఇంజనీర్ రజిత బృందం మంగళవారం మిత్రహిల్స్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పార్కు తమకు కావాలని, ఇక్కడ విషసర్పాలు తిరుగుతున్నాయని దీంతో భయందోళనకు గురవుతున్నామన్నారు. దీనిపై అధికారులకు నివేదిక అందిస్తామని, పార్కు అభివృద్ధికి కృషి చేస్తామని రజిత తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, రవికుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీతారామరాజు, కృష్ణ, భరత్, సుధాకర్‌రెడ్డి, కమలాకర్ కుమార్, సుబ్బారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రముక కన్నడ నటుడు దొడ్డన్నచే వైద్యరత్న అవార్డు అందుకుంటున్న భెల్ డాక్టర్ పుట్టరాజ్

బీహెచ్ఈఎల్ డాక్టర్ పుట్టరాజ్‌కు వైద్యరత్న అవార్డు

భెల్‌కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని జనరల్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న పుట్టరాజ్‌కు వైద్యరత్న అవార్డు వచ్చింది. యువతకు ఆరోగ్య సంరక్షణపై శిక్షణ ఇచ్చి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ పుట్టరాజ్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా కర్నాటక మీడియా క్లబ్ అసోసియేషన్, కర్నాటక రాష్ట్ర సోషల్ కల్చరల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యుల సత్కారంలో భెల్ వైద్యుడు పుట్టరాజ్ వైద్యరత్న అవార్డును అందుకున్నారు. బెంగుళూరులోని కేపీ పుటన్నచెట్టి టౌన్‌హాల్‌లో జరిగిన వేడుకలో ఆయనను సన్మానించి అవార్డును అందచేశారు. ఆరోగ్య రక్షణపై రాసిన పుస్తకాలు, యవత వ్యసనాలకు బానిసలు కాకాండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాల్లో చేపట్టిన ఉచిత వైద్య సేవలకు గుర్తింపుగా వైద్యరత్న అవార్డును ఆయనకు అందచేశారు.



జేసీఐ గుర్తింపు వేడుకలలో సిబ్బంది, వైద్యులతో కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ గురు ఎన్ రెడ్డి

కాంటినెంటల్ హాస్పిటల్‌కు జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్

రాయదుర్గం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నానక్‌రామ్‌గూడ ఐటీ జోన్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రికి వరుసగా నాలుగో సారి జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ లభించింది. ఈ సందర్భంగా హాస్పిటల్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ ఉన్నతమైన వైద్య సేవలను అందిస్తున్న కాంటినెంటల్ హాస్పిటల్‌కు మరో సారి ఇంటర్నేషనల్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు.

వారం రోజుల పాటు జేసీఐ టీమ్ జరిపిన ఆడిట్ అండ్ సర్వేలో 1183 జేసీఐ ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవలందిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించిందన్నారు.



విక్టర్ ఎక్స్ ప్రైవేట్ స్పోర్ట్స్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథార్టీ చైర్మన్ శివసేనారెడి

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

● స్పోర్ట్స్ అథార్టీ చైర్మన్ శివసేనారెడ్డి

గచ్చిబౌలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల పోత్సహించి మంచి భవిష్యత్ ఇస్తుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథార్టి చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. కొండాపూర్‌లో మంగళవారం విక్టర్ ఎక్స్ ప్రైవేట్ స్పోర్ట్స్ గ్రౌండ్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని, అందుకు అనుగుణంగా క్రీడాకారులు రాణించి పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. దేశానికి ప్రాతినిధ్యం వహించే ప్రతి క్రీడాకారుడికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. క్రీడాకారులు రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో బ్యాడ్మింటన్ గ్రాండ్ విక్టర్ స్పోర్ట్స్‌ను కొండాపూర్‌లో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒలపింక్ క్రీడాకారులు అశ్విని, ప్రణయ్, సినీనటి రెజీనా తదితరులు పాల్గొన్నారు.

పేట్లబురుజు ఆస్పత్రిలో నలుగురిపై వేటు

చార్మినార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది కలిగించిన నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశామని సూపరింటెండెంట్ రజనీరెడ్డి, ఆర్ఎంఓ అమృత లక్ష్మి తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో వారు మాట్లాడారు. అన్ని ఫ్లోర్‌లలో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రోగులు, సహాయకులు బాక్స్‌లో ఫిర్యాదు పత్రాలు వేయాలని, వారంలో రెండుసార్లు విచారించి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ గురువారం, శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి రోగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

రాహుల్‌గాంధీ సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాహుల్ గాంధీ సమావేశానికి వెళ్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సమీక్షా సమావేశంలో భాగంగా బోయిన్‌పల్లిలో జరుగుతున్న రాహుల్ గాంధీ సమావేశానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ప్రారంభించనున్న సమగ్ర కులగణనపై ప్రజలు, మేధావులు, పౌరహక్కులు, విద్యార్థి, కుల సంఘాల నేతలు, వివిధ సామాజిక వర్గాలవారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నగరానికి వచ్చారన్నారు. సమగ్ర కులగణన చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గచ్చిబౌలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత నగరానికి వచ్చిన సందర్భంగా ఆయనకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో స్వాగతం పలికి శేరిలింగంపల్లి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కారక్యకర్తలు తరలివెళ్లారు.

అమీన్‌పూర్‌లో 'హైడ్రా' సర్వే

● పార్కులు, రహదారులు కబ్జాపై అధికారులతో..



అమీన్‌పూర్‌లో సర్వే చేస్తున్న హైడ్రా, హెచ్ఎండీఏ, మునిసిపల్, రెవెన్యూ అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లో హైడ్రా అధికారులు సర్వే చేపట్టారు. పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ ఆదేశాలతో అమీన్‌పూర్‌లో మంగళవారం హైడ్రా ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. సర్వేలో జేడీ సర్వే కార్యాలయ అధికారులతో పాటు హైడ్రా, హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎకరాకు పైగా ఉన్న పార్కు స్థలంతో పాటు, రహదారులను గోల్డెన్ కీ వెంచర్ వాళ్లు కబ్జా చేశారంటూ వెంకటరమణ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఇరు పక్షాలు కోర్టును ఆశ్రయించడంతో హై కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేయించారు. మొత్తం 5 సర్వే నంబర్లలో 150 ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని వెంకటరమణ కాలనీ, చక్రపురి కాలనీ వాసులు, గోల్డెన్ కీ వెంచర్ నిర్వాహకులతో పాటు, పరిసర కాలనీ వాసులు, గ్రామస్థుల సమక్షంలో సర్వే చేశారు. లే ఔట్లను పరిశీలించి, సర్వే నంబర్ల ఆధారంగా, పార్కు స్థలాలతో పాటు రహదారులు పరిశీలించారు. సర్వే నంబర్లు, హద్దు రాళ్ల ఆధారంగా భూములు సరిహద్దులను నిర్ధారించి, ఎవరి లే ఔట్‌లోకి ఎవరు చొరబడ్డారనేది తేల్చనున్నారు.

పై అధికారుల అనుమతి లేకుండా..
సబ్ రిజిస్ట్రార్లను ఎలా అరెస్టు చేస్తారు!

● పోలీసుల తీరుపై మండిపడుతున్న రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు

● డీజీపీకి ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌కు వినతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా జ్యుడిషియల్ అధికారాలు కలిగిన సబ్-రిజిస్ట్రార్‌లను ఇటీవల పోలీసులు అరెస్టు చేయడంపై రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్ వ్యక్తుల మధ్య నెలకొన్న భూ వివాదంలో సబ్ రిజిస్ట్రార్లను బాధ్యులుగా పరిగణించడమేంటని ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల చట్టానికి లోబడి విధులు నిర్వహించినప్పటికీ, బయటి వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సబ్ రిజిస్ట్రార్లను అరెస్టు చేయడంపై ఉద్యోగ సంఘాలు సైతం ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయమై టీఎన్‌జీవో నేతలతో కలిసి రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంగళవారం ఐజీ అండ్ కమిషనర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతితో చర్చించారు. సబ్ రిజిస్ట్రార్లను అరెస్టు చేసిన పోలీసుల తీరుపై డీజీపీకి ఫిర్యాదు చేయాలని కోరారు.

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలెలా..

ఉద్యోగుల, అధికారుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గతంలో చేపట్టిన కౌన్సెలింగ్ విధానాన్నే అమలు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని ఉద్యోగ సంఘాలు కోరాయి. ఇటీవల నెల, రెండు నెలల వ్యవధిలో సబ్ రిజిస్ట్రార్లను, జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేయడం పట్ల ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో ఏ చిన్న తప్పు జరిగినా, జరుగకున్నా కిందిస్థాయి సిబ్బందిని మాత్రమే బదిలీ చేస్తున్నారని, ఇటీవల చేపట్టిన బదిలీల్లో డీఐజీ స్థాయి అధికారులను ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచిన్న పొరపాట్లు చేసి సస్పెండైన అటెండర్లను తిరిగి విధుల్లోకి తీసుకునే అధికారం గతంలో సస్పెండ్ చేసిన అధికారికే ఉండేదని, ఇటీవల వారందరినీ రీ-ఇన్‌స్టేట్‌మెంట్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాగైతే సదరు అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లు.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ల, జిల్లా రిజిస్ట్రార్ల మాటే వినే పరిస్థితి ఉండదని వాపోయారు. కొత్త విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని, కిందిస్థాయి ఉద్యోగుల సస్పెన్షన్, రీ-ఇన్‌స్టేట్‌మెంట్ అధికారాలను జిల్లా రిజిస్ట్రార్లకే కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల వినతుల మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

● డీజీపీ జితేందర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. అంబర్‌పేట వాటర్‌వర్క్స్ గ్రౌండ్‌లో డీసీటీ, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్న అంధుల క్రికెట్ పోటీలను డీజీపీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దివ్యాంగ క్రికెటర్ల ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సీనియర్ సిటిజన్ శాఖ కమిషనర్ శైలజ, టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీబీటీ కార్యదర్శి శ్రీశైలం పాల్గొన్నారు.

ఆ అధికారుల కేసులు ఏసీబీకి..

● చెరువుల్లో అనుమతులపై గతంలో హైడ్రా ఫిర్యాదు

● కేసులు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ

● కోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు చెరువుల పరిధిలో అక్రమ నిర్మాణాల అనుమతుల విషయంలో రెవెన్యూ అధికారులపై హైడ్రా నమోదు చేసిన కేసులను ఏసీబీకి అప్పగించే యోచనలో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈర్ల చెరువు, ఎర్రకుంట చెరువు పరిధిలో నిర్మాణాలకు అనుమతులు జారీ చేసిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టులో హైడ్రా అధికారులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజాంపేట, మేడ్చల్ మల్కాజిరిగి పరిధిలోని రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఈ కేసులకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసులకు సంబంధించి పలు అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడంతో కేసుల దర్యాప్తు ఏసీబీకి అప్పగించాలని ఈఓడబ్ల్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి సైబరాబాద్ పోలీసులు ఏసీబీ అధికారులకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. మదీనగూడలోని ఈర్ల చెరువు, నిజాంపేటలోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు ఇచ్చిన అధికారులపై హైడ్రా ఫిర్యాదు మేరకు పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. హైడ్రా కేసులు నమోదు చేసిన అధికారుల్లో కొంతమంది ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును సైతం ఆశ్రయించారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణ అనుమతుల సందర్భంగా పెద్ద మొత్తంలో అవినీతి జరిగినట్లు గుర్తించిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులు కేసును ఏసీబీకి అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు పత్రం అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిజాంపేటకు చెందిన నిలీమ ఆరోగ్యం బాగాలేక వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఆమెకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నిలీమ కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎంరేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

● డీజీపీ జితేందర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. అంబర్‌పేట వాటర్ వర్క్స్ గ్రౌండ్‌లో డీఏబీటీ, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్న అంధుల క్రికెట్ పోటీలను డీజీపీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దివ్యాంగ క్రికెటర్ల ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. సంకల్ప బలం ఉంటే అసాధ్యమనేది ఏదీ ఉండదనే దానికి వీరే మంచి ఉదాహరణ అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సీనియర్ సిటిజన్ శాఖ కమిషనర్ శైలజ, టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, డీఏబీటీ కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం జీవనభృతిని కల్పించాలి

దుండిగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత పేదరికం అనుభవిస్తున్నారని, రాజకీయ పార్టీల నాయకులు ఆటో డ్రైవర్ల జీవితాలను స్వార్థ రాజకీయాలతో శిథిలం చేస్తున్నారని బ్లూ ఇండియా పార్టీ నుంచి వైస్ ప్రెసిడెంట్ షేక్ అమీనుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఆటో డ్రైవర్లు జీవితం అత్యంత దౌర్భాగ్య జీవనవ్యవస్థకు ఇప్పటి కాంగ్రెస్, గతంలోని బీఆర్ఎస్ పార్టీలే అన్నారు. ఒక వైపు పెరిగిన నిత్యావసర ధరలు, మరో వైపు పెరిగిన ఇంధన ధరలు మండిపోతుండగా కొత్తగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలతో ఆటోడ్రైవర్ల జీవితం అగమ్య గోచరంగా తయారైందన్నారు. ఆటోడ్రైవర్ల కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం వారికి జీవనభృతి కింద నెలకు రూ.20 వేలను చెల్లించే పథకాన్ని రూపొందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి భూకబ్జా!

దుండిగల్ తండా-2లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ.. నిర్మాణాలు

దుండిగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గండిమైసమ్మ, దుండిగల్ మండల పరిధిలోని దుండిగల్ తండా-2లో సర్వే నంబరు 684లో దాదాపు 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు బాహాటంగా కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని తెలిసినా మండల రెవెన్యూ అధికారులు ఆ నిర్మాణాల జోలికి వెళ్లకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. తండా మొత్తం కబ్జాలతో కుచించుకుపోయింది. దీని పక్కనే ప్రముఖ కంపెనీ గతంలో ప్రభుత్వం వారికి కేటాయించిన భూమికి అదనంగా మరికొంత ఆక్రమించుకొని ప్రహరీలు నిర్మించింది. రెవెన్యూ అధికారులు గతంలో ఇది ప్రభుత్వ భూమి, దీంట్లో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఆ



ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న భారీ నిర్మాణం

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బోర్డును ఓ కబ్జాదారుడు పీకేసి, అదే స్థలంలో భారీ నిర్మాణాలు చేపడుతున్నాడు. ఈ భవన నిర్మాణం చేపడుతున్న కబ్జాదారుడు గాజులరామారం సర్కిల్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తనకు ఎదురే లేదంటూ, రాజకీయ నాయకులంతా తన చెప్పుచేతుల్లో ఉన్నారని చెప్పుకుంటూ చెలామణి అవుతూ తన అనుచర గణంతో దాదాపు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ఆసరాగా చేసుకొని, ఈ కబ్జాలకు తెర లేపాడు. తండా ప్రధాన రోడ్డులో 1000 గజాలకు పైగా ప్లాట్లు చేసి, మెయిన్‌రోడ్డుకి బస్తీ లోపల అక్రమ నిర్మాణాలు కొనసాగించాడు.

ఈ నిర్మాణాలకు తోడు అక్రమ రేకులషెడ్లు, ఇళ్ల నిర్మాణాలు చేసినట్టు తెలుస్తుంది. రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉండటం వల్ల రెవెన్యూ అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఆ కబ్జాల వైపు కన్నెత్తి చూడటానికి సాహసించడం లేదంటే అర్థం చేసుకోవచ్చు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఈ అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అక్కడక్కడా కూల్చుతూ వచ్చారు. కానీ ప్రభుత్వం ఉద్యోగం చేస్తూ, కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తికి రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉన్న కారణంగా తాండాలో ఉన్న ప్రభుత్వ భూమిని మొత్తం ఆక్రమించాడు. ఇటు



సర్వే నంబరు 684లోని స్థలంలో నిర్మాణాలు

ప్రభుత్వ వేతనం అందుకుంటూ, మరోపక్క ప్రభుత్వ భూమిలో షెడ్లు నిర్మించి, లక్షల రూపాయలు అద్దెలు వసూళ్లు చేస్తూ, తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనేది ప్రాశ్నార్థకంగా మారింది.

చర్యలు తీసుకుంటాం

దుండిగల్ తండా-2లో సర్వే నంబరు 684లో దాదాపు 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని తమ దృష్టికి వచ్చింది. రెండు రోజుల్లో పోలీస్ బందోబస్తు ద్వారా ఆ నిర్మాణాలను కూల్చివేయడంతోపాటు కబ్జాలకు పాల్పడ్డవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. వారిని గుర్తించి, భూకబ్జా కేసులను నమోదు చేస్తాం.

- మతిన్, తహశీల్దార్
గండిమైసమ్మ, దుండిగల్



వక్ఫ్‌బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్లు ఆపడం సరికాదు

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్లను ఆపడం సరికాదని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ సబ్-రిజిస్ట్రార్ అశోక్, నియోజకవర్గానికి చెందిన పలుకాలనీల వాసులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సర్వే నంబరు 171లో 55 కాలనీల్లో ప్రజలు సంవత్సరాలుగా నివశిస్తున్నారన్నారు. వీరిలో ఎక్కువగా మధ్య తరగతి, నిరుపేద ప్రజలు ఉన్నారని, వారు పైసా పైసా కూడబెట్టుకొని కొనుక్కొన్న స్థలాలకు, అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్లకు వక్ఫ్‌బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిపివేయడం సరికాదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు రిజిస్ట్రేషన్‌శాఖ డీఆర్, డీఐజీలను ఫోన్ ద్వారా సంప్రదించి త్వరలోనే సమస్యను పరిష్కరించాలని తెలియజేశామన్నారు.

అనంతరం పద్మానగర్ ఫేజ్-2, గణేష్‌నగర్ సంక్షేమ సంఘాల సభ్యులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమస్యను స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ బుద్ధ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఐజీ రెండురోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పునఃప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, గణేష్‌నగర్ సంక్షేమసంఘ సభ్యులు దుర్గారావు, సత్య, ఓబుల్ రెడ్డి, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

వేసవి నాటికి అదనంగా 10 టీఎంసీల నీళ్లు

● షాపూర్‌నగర్ జలమండలి డీజీఎం డి.రవి

షాపూర్‌నగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ జలమండలి పరిధిలోకి వచ్చే కాలనీలు, బస్తీలకు నాణ్యమైన తాగునీటిని అందిస్తున్నామని, నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జలమండలి డీజీఎం డి.రవి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే, తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



● వాటర్ సప్లయ్‌కి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

నీటిని అన్నివిధాలా టెస్టులు, క్లోరినేషన్ చేసి .22 నుంచి .25 పీపీఎం ఉండేటట్లు చూసి, ఆ తరువాతే స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

● లీకేజీల మరమ్మతులకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అన్ని లీకేజీలకు మరమ్మతులు చేశామని, ఎక్కడైనా లీకేజీ సమస్య ఉంటే స్థానికులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మరమ్మతులు పూర్తయిన 10, 15 రోజులకు ప్యాచ్ వర్క్ పనులు చేస్తామన్నారు.

● నీటి బిల్లులు సక్రమంగా చెల్లించని వారిపై మీరు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

బిల్లులు చెల్లించని వారికి నోటీసులు ఇస్తున్నామన్నారు. ఎక్కువ బిల్లు ఉన్న వారికి ఫైన్‌లు మాఫీ చేసి, వన్ సెటిల్‌మెంట్ క్రింద బిల్లు చెల్లించుకుంటున్నారు. ఈ అవకాశం ఈనెలాఖరు వరకు పొడిగించడం జరిగింది.బిల్లులు ఆన్‌లైన్‌లో కానీ, నేరుగా జలమండలి కార్యాలయం కౌంటర్‌లో చెల్లించవచ్చున్నారు.

● వచ్చే వేసవి నాటికి నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు ఏమైనా తీసుకున్నారా?

నీటికొరత లేకుండా చూసేందుకు ఫిల్లింగ్ స్టేషన్లు పెంచుతున్నామని, గాజులరామారం రిజర్వాయర్ వద్ద ఫిల్లింగ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదనంగా రావల్సిన 10 టీఎంసీల నీరు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

వృత్తివిద్యా కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి

● డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

దుండిగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్య కోర్సుల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, డీఐఈఓ కిషన్, ఎస్ఐవీ డాక్టర్ జోత్స్నారాణి, చీఫ్ ట్రైనింగ్ ఆఫీసర్ సతీష్‌రెడ్డిలు అన్నారు. బహదూర్‌పల్లిలోని కెఎం.పాండు మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ షైమన్ అధ్యక్షతన మంగళవారం వృత్తివిద్య అప్రెంటిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు కోర్సులపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యార్థులు రెండు నెలల ఓజేటీ ద్వారా మంచి స్కిల్స్ ఏర్పరుచుకొని, ట్రైనింగ్ రిపోర్టులో పేరు నమోదు చేసుకున్నట్లయితే మంచి కంపెనీలో, మంచి ఉద్యోగం సంపాదించుకోవచ్చని, అదే విధంగా ఒకేషనల్ విద్యార్థులు బ్రిడ్జి కోర్సులో ఉత్తీర్ణత సాధించి, బీటెక్, డిగ్రీ కోర్సులు కూడా చేయవచ్చన్నారు. ఈ కోర్సులు చేసినవారు జీవితంలో త్వరగా ఉద్యోగంలో స్థిరపడటానికి అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్, అధ్యాపకులు ఉపేందర్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

వినతి పత్రాలు

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లో ఆయన నివాసంలో పలువురు నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వీటిపై స్పందించిన ఆయన కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- షాపూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



రాహుల్‌కి స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

నిజాంపేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సన్నాహక సమీక్షా సమావేశానికి ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ మంగళవారం సాయంత్రం బోయినపల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు వచ్చిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి స్వాగతం పలికారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి నుంచి పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీగా వెళ్లారు.



కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

● గాజులరామారం

గాజులరామారంలోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆదేశాలతో ఆయన సోదరుడు కూన శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి స్వాగతం పలికారు. తరలి వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కూన శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో తరలివెళ్లిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు

బాలుడి కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

● తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

అఫ్జల్‌గంజ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు 12 గంటల్లో ఛేదించారు. క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ బి.బాలస్వామి, ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కిడ్నాప్ వివరాలను వెల్లడించారు. మల్లేపల్లి మంగర్‌బస్తీకి చెందిన మహ్మద్ సద్దాం, రుబీనాబేగం భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. సద్దాం అనారోగ్యంగా ఉండడంతో వైద్యం కోసం సోమవారం ఉదయం కుమారుడు షోయబ్(4)ను తీసుకొని ఉస్మానియాకు వచ్చాడు. ఆస్పత్రిలో చూపించుకున్న తర్వాత ఓపీ భవనం వద్ద పడుకున్నాడు. వీరిని వరంగల్ ప్రాంతానికి చెందిన షేక్ రఫిక్(38) గమనించాడు. షోయబ్‌ని తీసుకుని కాలినడకన ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, చాదర్‌ఘాట్ నుంచి డబీర్‌పురాకు వెళ్లాడు. రాత్రి అయినా ఉస్మానియా ఆస్పత్రికని వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన రుబీనాబేగం ఆస్పత్రికి వచ్చింది. సద్దాం ఫుట్‌పాత్‌పై పడుకుని ఉండగా, షోయబ్ కనిపించలేదు. అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని నాలుగు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి బాలుడి కోసం వెతికారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. షేక్ రఫిక్ బాలుడిని తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలుడిని ఓ మహిళ వద్ద ఉంచినట్లు తెలిపాడు. డీఎస్ఐ రామకృష్ణ, టీమ్ బాలుడిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

రఫిక్ నాలుగేళ్ల క్రితం వరంగల్ నుంచి నగరానికి వచ్చి ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్నాడని, మద్యానికి బానిసై డబ్బుల కోసం బాలుడిని కిడ్నాప్ చేశాడని డీసీపీ వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

● శంభీపూర్ కృష్ణ

దుండిగల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి నిత్యం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజవర్గ బీఆర్ఎస్ నాయకుడు, మల్లంపేట కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. మంగళవారం డీపోచంపల్లి, మల్లంపేట్, దుండిగల్ తదితర ప్రాంతాలకు చెందిన పలు కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు కృష్ణను కలిసి కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు.

అనంతరం కృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో సంప్రదించి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాలనీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న పలు కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు

కార్మికుల పదవీ విరమణ వయసును పెంచాలి

జీడిమెట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కంపెనీ యాజమాన్యం కార్మికుల పదవీ విరమణ వయస్సును తగ్గించి, వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని యూనియన్ అధ్యక్షులు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో థర్మోకేబుల్ కంపెనీ మేనేజ్‌మెంట్‌తో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాలకు పెంచగా, కంపెనీ మాత్రం 50 సంవత్సరాలకే వారికి రిటైర్‌మెంట్ ప్రకటించడం వల్ల కార్మికులు మిగిలిన సంవత్సరాల సర్వీస్‌ను కోల్పోతున్నారన్నారు. పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాలని యాజమాన్యాన్ని నాగరాజు కోరారు. యాజమాన్యం పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాకపోతే తెలంగాణ రాష్ట్ర కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి, చట్టపరంగా పరంగా కార్మికులకు రావాల్సిన వేతనాన్ని ఇప్పిస్తామన్నారు. ఈ సమావేశంలో థర్మోకేబుల్ డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, హెచ్ఆర్ రిషికుమార్, జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కంపెనీ యాజమాన్యంతో మాట్లాడుతున్న నాగరాజు

పై అధికారుల అనుమతి లేకుండా.. సబ్ రిజిస్ట్రార్లను ఎలా అరెస్టు చేస్తారు?

● పోలీసుల తీరుపై మండిపడుతున్న రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు
● డీజీపీకి ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌కు వినతి

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా జ్యుడీషియల్ అధికారాలు కలిగిన సబ్-రిజిస్ట్రార్‌లను ఇటీవల పోలీసులు అరెస్టు చేయడంపై రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్ వ్యక్తుల మధ్య నెలకొన్న భూ వివాదంలో సబ్ రిజిస్ట్రార్లను బాధ్యులుగా పరిగణించడమేంటని ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల చట్టానికి లోబడి విధులు నిర్వహించినప్పటికీ, బయటి వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సబ్ రిజిస్ట్రార్లను అరెస్టు చేయడంపై ఉద్యోగ సంఘాలు సైతం ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయమై టీఎన్‌జీఓ నేతలతో కలిసి రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంగళవారం ఐజీ అండ్ కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో చర్చించారు. సబ్ రిజిస్ట్రార్లను అరెస్టు చేసిన పోలీసుల తీరుపై డీజీపీకి ఫిర్యాదు చేయాలని కోరారు.

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలెలా..

ఉద్యోగుల, అధికారుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గతంలో చేపట్టిన కౌన్సెలింగ్ విధానాన్నే అమలు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని ఉద్యోగసంఘాలు కోరాయి. ఇటీవల నెల, రెండు నెలల వ్యవధిలో సబ్ రిజిస్ట్రార్లను, జిల్లా రిజిస్ట్రార్లను బదిలీచేయడం పట్ల ఉద్యోగ సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి. శాఖ పరిధిలో ఏ చిన్న తప్పు జరిగినా, జరుగకున్నా కిందిస్థాయి సిబ్బందిని మాత్రమే బదిలీ చేస్తున్నారని, ఇటీవలి బదిలీల్లో డీఐజీ స్థాయి అధికారులను ఎందుకు బదిలీ చేయలేదని ప్రశ్నించారు. చిన్నచిన్న పొరపాట్లు చేసి సస్పెండైన అటెండర్లను తిరిగి విధుల్లోకి తీసుకునే అధికారం గతంలో సస్పెండ్ చేసిన అధికారికే ఉండేదని, వారందరినీ రీ-ఇన్‌స్టేట్‌మెంట్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాగైతే అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లు... స్థానిక సబ్ రిజిస్ట్రార్ల, జిల్లా రిజిస్ట్రార్ల మాటే వినే పరిస్థితి ఉండదన్నారు. కొత్త విధానాన్ని ఉపసంహరించాలని, కిందిస్థాయి ఉద్యోగుల సస్పెన్షన్, రీ-ఇన్‌స్టేట్‌మెంట్ అధికారాలను జిల్లారిజిస్ట్రార్లకే కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘాల వినతుల మేరకు రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి

జీడిమెట్ల,నవంబరు5(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో డ్రైవర్లు, కండక్టర్లు బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాలను నివారించాలని టీజీఎస్ ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఆరేంకుష్రోఖాన్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డిపోలో నిర్వహించిన త్రైమాసికం ప్రగతిచక్ర అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ డిపోల నుంచి అవార్డులకు ఎంపికైన 23మంది కండక్టర్లు, డ్రైవర్లు, హెల్పర్లకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కవిత రూప్లా, ఎం.చౌహాన్, అన్ని డిపోల మేనేజర్లు, జీడిమెట్ల డిపో మేనేజర్ అంజనేయులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న వారితో ఆరేంకుష్రోఖాన్

ఆ అధికారుల కేసులు ఏసీబీకి..

● చెరువుల్లో అనుమతులపై గతంలో హైడ్రా ఫిర్యాదు ● కేసులు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ

హైదరాబాద్ సిటీ, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు చెరువుల పరిధిలో అక్రమ నిర్మాణాల అనుమతుల విషయంలో రెవెన్యూ అధికారులపై హైడ్రా నమోదు చేసిన కేసులను ఏసీబీకి అప్పగించే యోచనలో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈర్ల చెరువు, ఎర్రకుంట చెరువు పరిధిలో నిర్మాణాలకు అనుమతులు జారీ చేసిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టులో హైడ్రా అధికారులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజాంపేట, మేడ్చల్ మల్కాజిరిగి పరిధిలోని రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఈ కేసులకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసులకు సంబంధించి పలు అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడంతో కేసుల దర్యాప్తు ఏసీబీకి అప్పగించాలని ఈఓడబ్ల్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

దీనికి సంబంధించి సైబరాబాద్ పోలీసులు ఏసీబీ అధికారులకు లేఖ రాసినట్టు తెలుస్తోంది. మదీనగూడలోని ఈర్ల చెరువు, నిజాంపేటలోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు ఇచ్చిన అధికారులపై హైడ్రా ఫిర్యాదు మేరకు పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. హైడ్రా కేసులు నమోదు చేసి న అధికారుల్లో కొంత మంది ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును సైతం ఆశ్రయించారు.

చెరువుల ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణ అనుమతుల సందర్భంగా పెద్ద మొత్తంలో అవినీతి జరిగినట్లు గుర్తించిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ అధికారులు కేసును ఏసీబీకి అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

చెత్త వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జీడిమెట్ల,నవంబరు5(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ చెత్తవాహనం ఢీకొట్టడంతో ఓ కూలి మృతి చెందాడు.జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన పండరి (43)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు రొడామిస్త్రీనగర్ ప్రాంతంలోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. స్లాబ్ మిల్లర్ కూలీగా పనిచేస్తున్న పండరికి మద్యం సేవించే అలవాటు ఉంది. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో మద్యం మత్తులో హెచ్ఎంటీ జంగిల్ ప్రాంతంలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. ఆ సమయంలో జీహెచ్ఎంసీ చెత్తవాహనం డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టడంతో పండరి అక్కడికక్కడే మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసునమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. దర్యాప్తు చేస్తున్నారు.